## క్లుప్తంగా

### పెంచికల్‌దిన్నె వాసి సబితారాణికి డాక్టరేట్



నేరేడుచర్ల : మండలంలోని పెంచికల్‌దిన్నె గ్రామంలో నందమూరి బాబురావు కుమార్తె నందమూరి సబితారాణికి కుప్పం ద్రావిడ విశ్వవిద్యాలయం నుంచి గ్రంథాలయం శాస్త్రంలో డాక్టరేట్ లభించింది. డాక్టర్ ఆవినేని కిశోర్ పర్యవేక్షణలో 'రిసోర్స్ షేరింగ్ అండ్ నెట్‌వర్క్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల లైబ్రరీస్ ఆన్ హైదరాబాద్– రీజియన్ ఆఫిలియేటెడ్ టూ జెఎన్‌టీయూ' అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేసింది. జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని తన పరిశోధన పత్రాలను సమర్పించింది. దీంతో ఆమెకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా సబితారాణిని యూనివర్సిటీకి చెందిన అధ్యాపకులు, పెంచికల్ దిన్నె గ్రామస్తులు, స్నేహితులు, బంధువులు అభినందించారు.

### సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థి ప్రతిభ



బహుమతి అందుకుంటున్న ఓరుగంటి అనంతలక్ష్మి

కోదాడ: సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో చదరంగం విభాగంలో కోదాడలోని తేజ విద్యాలయంకు చెందిన 6వ తరగతి విద్యార్థిని ఓరుగంటి అనంతలక్ష్మి అండర్–15 విభాగంలో ప్రతిభ కనబరిచింది. మంగళవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జరిగిన పోటీల్లో రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానంలో నిలిచింది. అనంతలక్ష్మికి చెస్ చీఫ్ ఆర్బిటేటర్ శ్రీరామ్ రూ.10 వేల నగదు బహుమతితో పాటు సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. అనంతలక్ష్మి రాష్ట్రస్థాయిలో బహుమతి సాధించడంపై పాఠశాల అకడమిక్ డైరెక్టర్ సోమిరెడ్డి, ప్రిన్సిపాల్ ఉస్తేల రమాదేవి, కోచ్ నరసింహారావు, తండ్రి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

### దరఖాస్తుల ఆహ్వానం

నడిగూడెం : సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్.వాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఫిబ్రవరి 1 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 2024–25లో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు ఉమ్మడి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. ఫిబ్రవరి 23న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

### మాజీ సర్పంచ్ చినఅప్పయ్య నేత్రాలు దానం



నేత్రాలు సేకరిస్తున్న డాక్టర్లు

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్ల మాజీ సర్పంచ్ వీరవెల్లి చిన అప్పయ్య అనారోగ్యంతో మృతి చెందారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో నేరేడుచర్లలోని ఆయన నివాసం వద్ద వాసవీ, వనితా క్లబ్ ఆధ్వర్యంలో ఆయన నేత్రాలను డైమాండ్ నేత్రనిధికి అందజేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు గెల్లి లక్ష్మీనర్సింహారావు, ప్రధాన కార్యదర్శి జూలూరు అశోక్, కోశాధికారి తాళ్లూరి శ్రీనివాస్, కొత్త లక్ష్మణ్, శ్రీలతాకోటేశ్వర్‌రావు, నటరాజ్ ఉన్నారు.

### వాసవీ, వనితా క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

గరిడేపల్లి : వాసవీ, వనితా క్లబ్ గరిడేపల్లి మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడిగా గెల్లి సతీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఇలింద్ర సురేష్‌కుమార్, వనితా క్లబ్ అధ్యక్షురాలిగా గెల్లి పుష్పలత, ప్రధాన కార్యదర్శిగా ఇలింద్ర కల్పన, కోశాధికారిగా పొలిశెట్టి ధనలక్ష్మిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ నూతన అధ్యక్షుడు గెల్లి సతీష్‌కుమార్ మాట్లాడుతూ వాసవీ, వనితా క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. నిరుపేద ఆర్యవైశ్యుల కుటుంబాలకు చేయూతనందిస్తామన్నారు. ఆర్యవైశ్య సోదరులు, వాసవీ క్లబ్ సభ్యులు సహకారం అందించాలని ఆయన కోరారు.

### సోదరభావంతో మెలగాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

మునగాల : ప్రజలందరూ సోదరభావంతో మెలగాలని తహసీల్దార్ వి.ఆంజనేయులు అన్నారు. మంగళవారం మండలంలోని జగన్నాథపురంలో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. అంటరానితనాన్ని రూపుమాపేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్ దీన్‌దయాళ్, ఆర్‌ఐ రామారావు, కార్యదర్శి అనిత ఉన్నారు.

## న్యూఇయర్ సందడి

హుజూర్‌నగర్ : పట్టణంలో మంగళవారం సాయంత్రం న్యూఇయర్ సందడి నెలకొంది. పూలు, పండ్లు, రంగవల్లులు, బేకరీ షాపుల వద్ద కొనుగోలుదారులు బారులుదీరారు. మద్యం, మాంసం దుకాణాలకు క్యూ కట్టారు. ప్రజలంతా రాత్రి వరకు వేడుకలు జరుపుకుని ఉత్సాహంతో న్యూ ఇయర్‌కు స్వాగతం పలికారు. పట్టణంలో వివిధ ప్రాంతాలలో పోలీసులు మోహరించారు. కూడళ్లలో బ్రీతింగ్ ఎనలైజర్‌తో డ్రంక్ అండ్ టెస్టులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ముత్తయ్య, ఏఎస్‌ఐ రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌లో రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు

## ఆకట్టుకున్న ప్రదర్శన

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ సాయి పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం నూతన సంవత్సర వేడుకలను విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం పలువురు విద్యార్థులు 2025 ఆకృతిలో ప్రదర్శన నిర్వహించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బుస్సా సులోచన, కరస్పాండెంట్ బుస్సా మహేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



నడిగూడెంలోని శ్రీ సాయి పబ్లిక్ స్కూల్‌లో 2025 ఆకృతిలో చిన్నారుల ప్రదర్శన

## మహిళలకు రంగవల్లుల పోటీలు



మహిళలకు బహుమతులు అందజేస్తున్న ఫాదర్ మార్టిన్

మఠంపల్లి : న్యూయర్ వేడుకలను పురస్కరించుకుని మండల కేంద్రంలోని శుభవార్త చర్చి ఆవరణలో శుభోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మహిళలకు నిర్వహించిన మండల స్థాయి రంగవల్లుల పోటీలు ఆకట్టుకున్నాయి. పోటీలలో గెలుపొందిన విజేతలకు ఫాదర్ మార్టిన్, శుభోదయ యువజన సంఘం అధ్యక్షుడు గాదె జయభారత్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆదూరి స్రవంతికిషోర్‌రెడ్డి, యూత్ ప్రధాన కార్యదర్శి రంజిత్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, బాలశౌరెడ్డి, తదితరులు ఉన్నారు.

## నేడు మంత్రి ఉత్తమ్ పర్యటన

హుజూర్‌నగర్ : రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బుధవారం హుజూర్‌నగర్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు హుజూర్‌నగర్ సబ్ జైలును సందర్శిస్తారు. అనంతరం 10 గంటలకు మేళ్లచెరువు శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తారు. ఆ తర్వాత మహా శివరాత్రి జాతర ఏర్పాట్లపై సమీక్షిస్తారు. మధ్యాహ్నం 12:30 గంటలకు కోదాడ బయలుదేరి వెళతారు. ఈ పర్యటన వివరాలను మంతి పీఆర్‌ఓ వెంకట్‌రెడ్డి తెలిపారు.

## 2025లో అందరికీ మంచి జరగాలి

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

చిలుకూరు : నూతన సంవత్సరం 2025లో అందరికీ మంచి జరగాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆకాంక్షించారు. మంగళవారం చిలుకూరు మండల పరిధిలోని ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించేందుకు వచ్చిన మంత్రి బేతవోలు కాంగ్రెస్ పార్టీ నాయకులు ముద్రించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బజ్జూరి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు వనపర్తి రామారావు, రెమిడాల ఆనందరావు, బిట్టు అజయ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అంకిత భావంతో పనిచేస్తేనే గుర్తింపు



ఎల్లమ్మను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ తదితరులు

నేరేడుచర్ల : ప్రభుత్వ ఉద్యోగులు అంకిత భావంతో పని చేస్తేనే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అలక సరిత అన్నారు. నేరేడుచర్ల మున్సిపల్ కార్యాలయంలో స్వీపర్‌గా పని చేస్తూ పదవి వీరమణ పొందిన ఇంజమూరి ఎల్లమ్మను మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి, మేనేజర్ యాకుబ్ పాష, కౌన్సిలర్లు కొణతం చిన వెంకట్‌రెడ్డి, బాషా, వేమూరి నాగవేణి, బాణోతు లలితభరత్, నాగయ్య, మాజీ ఎంపీపీ పారేపల్లి శేఖర్‌రావు, సీపీఎం పట్టణ కార్యదర్శి కొదమగుండ్ల నగేష్, భారత్, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

కోదాడ: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతోపాటు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని ప్రముఖ వైద్యురాలు గంపల శిరీష కోరారు. మంగళవారం కోదాడ పట్టణ పరిధిలోని గుడిబండ రోడ్డులో ఉన్న ఎస్‌ఆర్‌ఎం పాఠశాలలో ప్రథమ చికిత్స– పరిశుభ్రత అనే అంశంపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. యుక్త వయస్సులో ఆడ పిల్లలు పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కేసినేని శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ధనమూర్తివి రాజీలేని పోరాటాలు

- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

కోదాడరూరల్ : ప్రభుత్వ ఉపాధ్యాయ సమస్యలపై ఆర్.ధనమూర్తి రాజీలేని పోరాటాలు చేశాడని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని గుడిబండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన మ్యాథ్స్ టీచర్ ధనమూర్తి ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యూటీఎఫ్ లక్ష్యాలకు అనుగుణంగా మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పనిచేసి పాఠశాలల అభివృద్ధికి తనవంతుగా కృషి చేశాడని తెలిపారు.. విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తూనే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాడుతూ ప్రజల మన్ననలు పొందారని అన్నారు. ఈ సందర్భంగా ధనమూర్తి దంపతులను ఘనంగా సన్మానించారు. యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సోంబాబు, ప్రధాన కార్యదర్శి అనీల్‌కుమార్, పెరుమాళ్ల వెంకటేశం తదితరులు ఉన్నారు.

## ఎల్బీనగర్‌లో మెగా వైద్యశిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

గరిడేపల్లి : మండలంలోని ఎల్బీ నగర్ గ్రామంలో మంగళవారం మిర్యాలగూడెం అపోలో రిచ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యం, రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు బీపీ, షుగర్, ఈసీజీ టెస్టులు ఉచితంగా నిర్వహించి మందులు అందజేశారు. యువకులు రక్తదానం చేశారు. పలువురు బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ.. బోధ సైదిరెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా హెల్త్ క్యాంపు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యూత్ సభ్యులు గోదా శ్రీనివాస్‌రెడ్డి, సురభి వీరబాబు, ముదిరెడ్డి ప్రదీప్‌రెడ్డి, కొప్పిశెట్టి వాసు, నరేష్, ఎల్లయ్య, బద్రి, సుమంత్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## సబ్‌స్టేషన్ ఎదుట సీఐటీయూ నిరసన



మేళ్లచెరువు సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

మేళ్లచెరువు : విద్యుత్ రంగం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా పోరాడాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వట్టెపు సైదులు పిలుపునిచ్చారు. కేంద్రం ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా మంగళవారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల్లో విద్యుత్ సంస్థలను దొడ్డి దారిన వేలం వేయిస్తూ ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని చూస్తోందని, ఇప్పటికే తెలంగాణలో సంస్కరణలు మొదలయ్యాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇలాంటి చర్యలను వెంటనే విరమించుకోవాలని లేని పక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శ్రీను, సాయి, శరత్‌రెడ్డి, సైదులు, ఆదినారాయణ, నరసింహారావు, నరేష్ పాల్గొన్నారు.

**విద్యుత్ రంగాన్ని కాపాడుకుందాం**

గరిడేపల్లి : విద్యుత్ రంగాన్ని కాపాడుకుందామని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్‌కే యాకూబ్ అన్నారు. విద్యుత్ రంగం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రచురించిన కరపత్రాలను మంగళవారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ కార్మికులకు పంపిణీ చేసి మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని అన్నారు. చండీగఢ్, ఉత్తరప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో డిస్కంలను ప్రైవేటీకరించే ప్రయత్నాలు మొదలయ్యాయని అన్నారు. కార్యక్రమంలో ఇస్మాయిల్, వెంకన్న, విజయ్, సుధాకర్, నరేష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయాలి

- సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరిబాబు



ఎమ్మెల్యే హరిబాబును సన్మానిస్తున్న కోదాడ బీజేపీ నాయకులు

కోదాడరూరల్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయాలని సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే పాల్వాయి హరిబాబు అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్తున్న ఆయన కోదాడలోని కేఎల్‌ఆర్ కాలనీలో గల ఎస్‌ఆర్‌ఐ జలగం సుధీర్ నివాసంలో కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నైతిక విలువలతో కూడిన బీజేపీలో సభ్యులుగా ఉండటం మన అదృష్టమని అన్నారు. భారతీయ జనతా పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయనను పార్టీ నాయకులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కనగాల నారాయణ, జాయింట్ కన్వీనర్ బొలిశెట్టి కృష్ణయ్య, రాష్ట్ర నాయకురాలు నూనె సులోచన, యాదా రమేష్, పురుషోత్తం, కిట్టు, సాయిశర్మ తదితరులు ఉన్నారు.

## 'మారని మత్స్యకారుల బతుకులు'

మఠంపల్లి : రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినా మత్స్యకారుల బతుకులు మారడం లేదని మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శీలం శ్రీను అన్నారు. మంగళవారం మఠంపల్లిలో గల చేపల మార్కెట్‌ను ఆయన సందర్శించి మాట్లాడారు. రాష్ట్రంలో మత్స్యకారులను ఆదుకునేందుకు మత్స్య మిత్ర గ్రూపులను పునరుద్ధరించాలన్నారు. ప్రతి మహిళా సొసైటీకి రూ.10 లక్షల రుణం అందజేయాలని డిమాండ్ చేశారు. మఠంపల్లి మండలంలో జీవనదిగా ఉన్న కృష్ణానది ఉందని, కానీ మత్స్య కార్మికులు నిత్యం వేట సాగించి తెచ్చే చేపలు విక్రించుకునేందుకు చేపల మార్కెట్ లేక రోడ్ల వెంటనే అమ్ముకుంటూ ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రోడ్ల వెంట వ్యాపారంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని వెంటనే అధికారులు దృష్టి సారించి చేపల మార్కెట్‌కు స్థలం కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రాములు, నాగమణి, నరసయ్య, బి.నాగమణి, సైదమ్మ, తదితరులు ఉన్నారు.

## తిరుప్పావై పఠించి.. పూజలు నిర్వహించి



అభయాంజనేయస్వామి ఆలయంలో తిరుప్పావై పఠిస్తున్న పూజారులు, భక్తులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని దేవాలయాల్లో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం పట్టణంలోని శ్రీసీతారామచంద్రస్వామి, శ్రీజ్ఞాన సరస్వతి, అభయాంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మూలమూర్తులకు పంచామృతాలు, పంచ సూక్తాలతో పూజలు చేశారు. శ్రీసూక్తం పారాయణం, వేదపఠనం, అష్టోత్తరాలు, తిరుప్పావై పాశుర పఠనం గావించారు. కార్యక్రమంలో పూజారులు, అధికారులు, పాలవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులపై ప్రణాళికలు సిద్ధం చేయండి

నడిగూడెం : వచ్చే ఐదు నెలల కాలపరిమితికి ఉపాధి హామీ పనులపై ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీఓ సయ్యద్ ఇమామ్ సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందికి నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని, ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అర్హులైన ప్రతి కూలీకి పని కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఓ శ్రీనివాసరావు, ఈసీ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్‌లో ప్రకటనలు చూసి మోసపోవద్దు



మాట్లాడుతున్న ఎస్‌ఐ ముత్తయ్య

హుజూర్‌నగర్ : విద్యార్థులు సెల్‌ఫోన్‌లో ప్రకటనలు చూసి మోసపోవద్దని ఎస్‌ఐ ముత్తయ్య అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్ పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్‌లో విద్యార్థులకు ×సెల్‌ఫోన్‌తో మోసాలు× అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సెల్‌ఫోన్‌లో చదువుకు సంబంధించిన అంశాలను మాత్రమే చూసి తెలుసుకోవాలన్నారు. ఇంటర్‌నెట్‌లో వచ్చే వివిధ లింక్‌లను ఓపెన్ చేసి వ్యక్తిగత విషయాలను ఇవ్వవద్దని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో ఆకర్షణీయంగా సూక్తులు, చిత్రాలు పెట్టి యువతులను మభ్యపెట్టే వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గంజాయి, మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దని, ఎవరైనా వినియోగించినట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని, వారి వివరాలను రహస్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రమేష్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## బూరుగడ్డలో మంజలి ఉత్సవం



పూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో మంజలి ఉత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, సేవాకాలం, క్షేత్రపాలకుడికి ఆకుపూజ, అలంకరణ, పంచామృతాలతో అభిషేకం, గంధ సింధూరం, పానకం, వడపప్పు, పండ్లు, పులిహోర, వడమాల, ఆకుపూజ, మంగళాశాసనం, కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యరగాని గురవయ్యగౌడ్, కార్యనిర్వాహణాధికారి ఎంపీ లక్ష్మణరావు, అర్చకులు ముడుంబై హరీష్‌కుమార్‌చార్యులు, కిరణ్‌కుమార్‌గౌడ్, ఉపేందర్, రమేష్, భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## అమిత్‌షా రాజీనామా చేయాలని రాస్తారోకో

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై పార్లమెంటు అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం చింతలపాలెంలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన రాస్తారోకోలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వట్టెపు సైదులు, మండల కార్యదర్శి సుందర మాళీశ్వర్‌రెడ్డి, నాయకులు పుల్లయ్య, జాన్‌మియా, గోవిందరెడ్డి, మస్తాన్, సైదా, బ్రహ్మారెడ్డి, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు

## గ్రామాభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలి

చిలుకూరు : గ్రామాభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని మండల పంచాయతీ అధికారి జగదీష్ అన్నారు. మంగళవారం చిలుకూరు మండలంలోని కొండాపురం గ్రామంలో జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు గ్రామ సభలో తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కార్తీక్‌రెడ్డి, గ్రామపెద్దలు, మాజీ ప్రజాప్రతినిధులు, జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ప్రచారం చేస్తున్న త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు

హుజూర్‌నగర్ : దైవానుగ్రహం పొందేందుకు, జ్ఞాన సముపార్జనకు దక్షిణాయణం సరైన సమయమని త్రైతసిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్ పట్టణంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక కోదాడ, హుజూర్‌నగర్ కమిటీ సభ్యులు పట్టణంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం సృష్టి మొదలుకు గుర్తు అని, సోమవారం అనేది ఆత్మ జ్ఞానానికి, మంగళవారం మోక్షానికి గుర్తు అని తెలిపారు. కమిటీల అధ్యక్షుడు పి.వెంకటేశ్వర్లు, సభ్యులు బి.వీరన్న, జె.శివరామకృష్ణ, ఎం.శైలజ, వి.మహేష్, విజయ, డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీ ప్రహ్లాద యోగానంద శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారిని, అమ్మవార్లను అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం రక్తికట్టించారు. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాల వేడుకతో కల్యాణ తంతును వైభవంగా నిర్వహించారు. శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకుల పూజ చేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో విఫలం



మాట్లాడుతున్న రాజు

మఠంపల్లి : విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలం చెందుతున్నాయని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ నాయకుడు ఎం.రాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రం సమీపంలోని మోడల్ స్కూల్‌లో ఎస్‌ఎఫ్‌ఐ 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సమసమాజ స్థాపనకు కృషి చేయాలన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎస్‌ఎఫ్‌ఐ ఎన్నో పోరాటాలు చేస్తూ విజయం సాధించుతుందన్నారు. గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బాలునాయక్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ప్రశాంత్, జీవన్, వినోద్, రాము, అమృత, అంకిత పాల్గొన్నారు.

## యువకుల బైండోవర్

గరిడేపల్లి : నూతన సంవత్సర వేడుకలను అందరూ ప్రశాంతమైన వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలని ఎస్‌ఐ నరేష్ సూచించారు. మంగళవారం రాత్రి బైక్‌లపై విచ్చలవిడిగా తిరుగుతున్న పలువురిని పట్టుకొని కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కొంతమంది అనుమానిత యువకులను పోలీస్ స్టేషన్‌కి పిలిపించి బైండోవర్ చేసినట్లు తెలిపారు.

**ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన**

మోతె : మండలంలోని రాఘవాపురం ఎక్స్ రోడ్డు గ్రామంలో సిబ్బంది చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను మంగళవారం మోతె ఎంపీడీఓ ఆంజనేయులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేను పంచాయతీ కార్యదర్శులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. సర్వే సమయంలో సర్వర్ సమస్య వస్తే సంబంధిత టెక్నీషియన్లను సంప్రదించడంతో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు.

**ఇసుక లారీ పట్టివేత**

కోదాడరూరల్ : ఏపీ నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని మంగళవారం కోదాడ పట్టణ పోలీసులు పట్టుకున్నారు. ఏపీలోని నందిగామ నుంచి హైదరాబాద్‌కు ఇసుకను ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా తరలిస్తుండగా పట్టణ పరిధిలోని మేళ్లచెరువు ఫ్లైఓవర్ బ్రిడ్జిపై పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈమేరకు ఇసుక లారీని స్టేషన్‌కు తరలించి, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

**రంగస్థల కళలను కాపాడుకోవాలి**

హుజూర్‌నగర్ : రంగ స్థలం కళలను ప్రతిఒక్కరూ కాపాడుకోవాలని రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు దొంతగాని సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కళాకారులను ప్రోత్సహించాలని, రంగస్థల కళలను కాపాడాలని స్వచ్ఛంద సంస్థలు, విద్యా సంస్థల వారిని విజ్ఞప్తి చేశారు.

## సంక్షిప్త సమాచారం

**మార్కెట్ కమిటీ చైర్మన్‌కు అభినందనలు**

నడిగూడెం : కోదాడ వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా ఎంపికైన నడిగూడెంకు చెందిన వేపూరి తిరుపతమ్మ, ఆమె భర్త కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి సుధీర్‌కు మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి, నాయకులు గుండు శ్రీనివాస్, దున్నా శ్రీను, నళినిరెడ్డి, మొక్క భిక్షపతి, శెట్టి సతీష్, గుండు లింగరాజు, శ్రీను, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

**అందుబాటులో ఎరువులు**

మోతె : మండలంలోని సర్వారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రైతులకు నాగార్జున యూరియా, గ్రోమోర్ 20.20–0.13 ఎరువులు అందుబాటులో ఉన్నట్లు సర్వారం పీఏసీఎస్ చైర్మన్ ముప్పాని శ్రీధర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్స్ జీరాక్స్‌తో కార్యాలయంలో సంప్రదించి ప్రభుత్వం నిర్ధారించిన ధర యూరియా రూ.270, గ్రోమోర్ 20.20–0.13 రూ.11,50 చెల్లించి ఎరువులు పొందవచ్చన్నారు.

**ఎస్సీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవం**

నడిగూడెం : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో మంగళవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ జి.అజయ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ దళితులను చిన్నచూపు చూడొద్దని కోరారు. కార్యక్రమంలో ఆర్‌ఐ కొండపల్లి గోపాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి శ్రీను, ఏపీఎం రామలక్ష్మి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**అయ్యప్ప సన్నిధానంలో అన్నదానం**

కోదాడరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్ రోడ్డులో గల గాలి రమేష్‌నాయుడు అయ్యప్ప సన్నిధానంలో మాలధారులకు అన్నదాన కార్యక్రమాన్ని మంగళవారం మారిశెట్టి అప్పారావు, వంగవీటి వెంకన్న ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ నిర్వాహకులు గాలి శ్రీనివాస్‌నాయుడు, అయ్యప్ప, తిరుపతమ్మ మాలధారులు ఉన్నారు.